సాక్షి రంగారెడ్డి

మంగళవారం । 23 । జూలై । 2024



హామీలు మరిచిన ప్రభుత్వం

బీసీలకు ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ నెరవేర్చలేదని బీజేపీ జిల్లా అర్బన్ అధ్యక్షుడు సామ రంగారెడ్డి ఆరోపించారు. 8లో▸



వేతనాలు చెల్లించాలి

ఆదర్శ పాఠశాలల్లో పనిచేస్తున్న తమకు పెండింగ్ వేతనాలు చెల్లించాలని ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు కోరారు. 8లో▸



అక్రమ సర్టిఫికెట్ల జారీలో..

తహసీల్దార్ కార్యాలయం నుంచి అక్రమంగా ఆదాయ సర్టిఫికెట్లు జారీ చేసిన కేసులో ముగ్గురిని రిమాండ్‌కు తరలించారు. 8లో▸

నేడు ఇబ్రహీంపట్నం మున్సిపల్ కమిషనర్‌తో ఫోన్ ఇన్

ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలో పారిశుద్ధ్యం, పరిసరాల పరిశుభ్రత, సీజనల్ వ్యాధులు, ప్రజల ఇబ్బందులు తదితర విషయాలపై ప్రజలకు ఫోన్ ఇన్ ద్వారా కమిషనర్ సలహాలు, సూచనలు ఇస్తారు.



అంశం : పారిశుద్ధ్యం, పరిశుభ్రత, సీజనల్ వ్యాధులు
మున్సిపాలిటీ : ఇబ్రహీంపట్నం
కమిషనర్ : రవీంద్రసాగర్
తేదీ : 23-7-2024 (మంగళవారం)
సమయం : ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు

ఫోన్ చేయాల్సిన నంబర్లు :
73867 04867, 76758 29268

న్యూస్‌రీల్

సమస్యలను సత్వరమే పరిష్కరించండి

అధికారులకు కలెక్టర్ శశాంక ఆదేశాలు



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ శశాంక

ఇబ్రహీంపట్నం రూరల్: తమ సమస్యలు చెప్పుకోవడానికి కలెక్టరేట్‌కు వచ్చిన ప్రతి ఫిర్యాదుదారుడి పని పెండింగ్‌లో పెట్టకుండా సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ శశాంక అధికారులను ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా తమ సమస్యలు తెలపడానికి వచ్చిన ప్రజల నుంచి ఆయన అడిషనల్ కలెక్టర్ భూపాల్‌రెడ్డి, డీఆర్‌ఓ సంగీతతో కలిసి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజావాణి కార్యక్రమంలో శాఖల వారీగా స్వీకరించిన ఫిర్యాదులపై సత్వరమే స్పందించి సమస్యలను పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. మొత్తం 95 ఫిర్యాదులు వచ్చాయని వాటిని పరిశీలించి సత్వరమే పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పంచాయతీ సిబ్బంది వేతనాలు చెల్లించాలి

ఇబ్రహీంపట్నం రూరల్: గ్రామ పంచాయతీలో పని చేస్తున్న సిబ్బందికి వేతనాలు తక్షణమే చెల్లించాలని పంచాయతీ ఎంప్లాయీస్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు గ్యార పాండు డిమాండ్ చేశారు. పెండింగ్ వేతనాలు చెల్లించాలని కోరుతూ సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పాండు మాట్లాడుతూ ఆరు నెలలుగా వేతనాలు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఇటీవల పంచాయతీ సిబ్బంది వేతనాలకు రూ.150 కోట్లు విడుదల చేసినట్లు ప్రభుత్వం ఆర్డర్ ఇచ్చిందని, కానీ ఏ ఒక్క జీపీలో జమ చేయలేదన్నారు. పంచాయతీ కార్మికులను పర్మినెంట్ చేయాలని కోరారు. జీవో 51 రద్దు చేసి మల్టీపర్పస్ వర్కర్ విధానం రద్దు చేయాలని, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలన్నారు. రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ అమలు చేయాలని, దహన సంస్కారాలకు రూ.10వేల నుంచి రూ.20వేలకు సాయం పెంచాలన్నారు. కార్యక్రమంలో సీఐటీ యూ జిల్లా నాయకులు పోచమోని కృష్ణ, యూనియన్ రాష్ట్ర నాయకులు జంగయ్య, కోశాధికారి దేవదాస్, నరేష్ పాల్గొన్నారు.

చెరువులో చేపలు మృత్యువాత



కందుకూరు: మండలంలోని నేదునూరు నల్ల చెరువులో చేపలు మృత్యువాత పడ్డాయి. మత్స్య పారిశ్రామిక సహకార సంఘం మండల అధ్యక్షుడు లింగంముదిరాజ్, జిల్లా ఆడిట్ కమిటీ డైరెక్టర్ దూస వెంకటేష్‌ముదిరాజ్ ఆధ్వర్యంలో సంఘం నాయకులు సోమవారం చెరువును పరిశీలించారు. విష ప్రయోగంతో దాదాపు నాలుగు టన్నుల మేర చేపలు మృతిచెందినట్లు ఆరోపించారు. చేపల మృతికి కారణాన్ని తెలుసుకోవడానికి చెరువులో నీటితో పాటు చనిపోయిన చేపలను పరీక్షల కోసం పంపిస్తామన్నారు. అనంతరం ఈ ఘటనపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఆలయ భూమిలో అనుమతి లేకుండానే వేసిన ఫెన్సింగ్



ఆలయానిదే కదా ఆక్రమించేద్దాం..!

అది రూ.25 కోట్లకు పైగా విలువ జేసే ఆలయ భూమి.. ఇంకేముంది అక్రమార్కుల కన్ను దానిపై పడింది.. ఇప్పటికే రెండు ఎకరాలకు పైగా అన్యాక్రాంతమైంది.. తాజాగా మొక్కల పెంపకం పేరుతో కడీలు పాతడం.. ఎంచక్కా ఫెన్సింగ్ వేయడం జరిగిపోయాయి.. తమ పలుకుబడిని ఉపయోగించి కొంతమంది భూ రికార్డులనే మార్చే పనిలో నిమగ్నమయ్యారు.. స్థానికుల అభ్యంతరంతో వెలుగులోకి వచ్చింది..

తిరుమలేశుడి భూమిపై అక్రమార్కుల కన్ను

- ఇప్పటికే రెండు ఎకరాలకు పైగా ఆక్రమణ
- తాజాగా మొక్కల పెంపకం పేరుతో ఫెన్సింగ్
- అభ్యంతరం వ్యక్తం చేసిన కొంతమంది గ్రామస్తులు
- సీరియస్‌గా పరిగణించిన దేవాదాయ, ధర్మాదాయ శాఖ

యాచారం: నాగార్జునసాగర్–హైదరాబాద్ రహదారికి పక్కనే యాచారంలో తిరుమలేశుడి ఆలయం ఉంది. కోరిన కోర్కెలు తీర్చే స్వామిగా పేరుంది. ఈ ఆలయానికి గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 42లో 10.21 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. ఇందులో పండే పంటల ద్వారా వచ్చే ఆదాయాన్ని స్వామి వారి ధూప, దీప నైవేద్యాలకు ఖర్చు చేయాలనే నిబంధన ఉంది. కానీ ఎలాంటి పంటలు పండించకపోవడం.. దేవాదాయ, ధర్మాదాయ శాఖ నుంచి నిధులు రాకపోవడంతో గ్రామానికి చెందిన కొండాపురం యాదగిరి 30 ఏళ్లకు పైగా స్వామివారికి సొంత ఖర్చులతో సేవ చేశారు. ఆయన మరణానంతరం రెండో కుమారుడు కొండాపురం రాజేష్ సొంత ఖర్చులతో ప్రతి శనివారం స్వామివారికి పూజలు నిర్వహిస్తున్నారు. సాగర్–హైదరాబాద్ రహదారిపై రాకపోకలు సాగించే భక్తులు ప్రతి శనివారం 300కుపైగా అడుగుల ఎత్తున్న గుట్టపైకి వెళ్లి స్వామి వారిని దర్శించుకుంటారు.

కబ్జా కోరల్లో చిక్కి..

రూ. 25 కోట్లకు పైగా విలువ జేసే ఇక్కడి ఆలయ భూమి ప్రస్తుతం కబ్జా కోరల్లో చిక్కుకుంది. భూమికి హద్దులు, ఫెన్సింగ్ లేకపోవడంతో అక్రమార్కుల కన్ను పడింది. ఆలయ భూమి చుట్టూ గజాల చొప్పున కబ్జా చేసి కడీలు పాతి రంగులు వేస్తున్నారు. నకిలీ పత్రాలు సృష్టించి రిజిస్ట్రేషన్ అయ్యేట్లు చేస్తూ రూ.లక్షలు ఆర్జిస్తున్నారు. 10.21 ఎకరాల ఆలయ భూమిలో ఇప్పటికే రెండు ఎకరాల వరకు (సుమారు రూ.5కోట్లు) ప్లాట్లుగా మారిపోయింది. రెండు, మూడేళ్లుగా కొందరు సర్వే నంబరు 42లోని 10.21 ఎకరాల భూమి తమ పూర్వీకులదని రికార్డుల మార్పు కోసం తీవ్రంగా శ్రమిస్తున్నారు. యాచారం తహసీల్దార్, ఇబ్రహీంపట్నం ఆర్డీఓ, కలెక్టరేట్, సీసీఎల్ఎలలో రికార్డుల మార్పు కోసం పైరవీలు సాగిస్తున్నారు. గతంలో తహసీల్దార్‌గా పనిచేసిన వసంతకుమారి అప్పట్లో ఫిర్యాదులు ఆధారంగా ఆలయ భూమిని సర్వే చేయించి హద్దురాళ్లు పాతారు. ప్రస్తుతం ఆ హద్దురాళ్లు మాయమైపోయాయి.

తాజాగా ఫెన్సింగ్‌తో..

ఆలయ భూమిలోని అర ఎకరాలో పలు రకాల పండ్ల మొక్కల పెంపకం కోసం పంచాయతీ కార్యదర్శి గుంతలు తీయించారు. ఆలయ కమిటీ (ప్రస్తుతం ఆలయ కమిటీ ఏర్పాటు కాలేదు) పేరుతో కొందరు నాయకులు ఎంపీడీఓ నరేందర్‌రెడ్డిని కలిసి ఆ భూమిలో పండ్ల మొక్కలు పెట్టుకోవచ్చని తెలియజేశారు. దేవాదాయ, ధర్మాదాయ శాఖ అనుమతి లేకుండా భూమిని దున్ని, ఫెన్సింగ్ వేశారు. పంచాయతీ ఆధ్వర్యంలో ఆలయ భూమిని దున్నడం, కొంత మేర భూమికి ఫెన్సింగ్ వేయడంతో ఇదే అదునుగా అక్రమార్కులు భూమిని కబ్జా చేయడానికి కన్నేశారు. చుట్టూ ఖాళీ స్థలాన్ని గుర్తించి కడీలు పాతేందుకు చూస్తున్నారు. దీంతో స్థానికులు కొందరు రెండు రోజుల క్రితం దేవాదాయ, ధర్మాదాయ శాఖకు చెందిన ఆలయ ఇన్‌చార్జి ప్రణీత్‌కు ఫిర్యాదు చేశారు. తమ అనుమతి లేకుండా ఆలయ భూమిలో చిన్న రాయి కూడా తీయరాదని, అడుగు కూడా పెట్టరాదని ఆయన సీరియస్ అయ్యారు.

కబ్జా కోరల్లోంచి విడిపించాలి



కోట్ల రూపాయల విలువచేసే తిరుమలేశుడి భూమిని కబ్జా కోరల్లోంచి రక్షించాలి. అక్రమార్కులకు అవకాశం ఇవ్వొద్దు. అధికారులు సర్వే చేసి మొత్తం భూమికి ఫెన్సింగ్ వేయాలి.

– కొప్పు భాషా, దళిత మోర్చా రాష్ట్ర మాజీ అధ్యక్షుడు

ఆలయ కమిటీ అంటేనే..



గ్రామానికి చెందిన కొంతమంది ఆలయ కమిటీ సభ్యులమని చెబితేనే ఆలయ భూమిలో పండ్ల మొక్కలు నాటడానికి పని మొదలు పెట్టాం. ఆ తర్వాత మరి కొందరు వద్దని ఫిర్యాదు చేస్తున్నారు.

– నరేందర్‌రెడ్డి, ఎంపీడీఓ, యాచారం

త్వరలో సర్వే చేయిస్తాం



ఆలయ భూమిలో అనుమతి లేకుండా కొంతమంది దున్ని, ఫెన్సింగ్ వేసినట్టు మా దృష్టికి వచ్చింది. త్వరలోనే సర్వే చేసి హద్దులు పాతి, ఫెన్సింగ్ వేస్తాం. కబ్జా చేస్తే క్రిమినల్ కేసులు పెడుతాం.

– ప్రణీత్‌కుమార్, ఆలయ ఇన్‌చార్జి, దేవాదాయ, ధర్మాదాయ శాఖ

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

ఇబ్రహీంపట్నం రూరల్: పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ తక్షణమే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌కు ర్యాలీగా వెళ్లి ధర్నా నిర్వహించారు. సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ప్రణయ్, బి.శంకర్ మాట్లాడుతూ.. నాలుగేళ్లుగా విద్యార్థులకు చెల్లించాల్సిన స్కాలర్‌షిప్‌లు, ఫీజురీయింబర్స్‌మెంట్ రూ.8,214 కోట్లు విడుదల చేయకుండా కాలయాపన చేయడం తగదన్నారు. జిల్లాలో సుమారు రూ.730 కోట్ల బకాయిలు ఉన్నాయన్నారు. గత ప్రభుత్వం విద్యారంగాన్ని అభివృద్ధి చేస్తామని మాటలకే పరిమితమైందని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడు నెలలు గడుస్తున్నా ఉలుకు పలుకూ లేదని విమర్శించారు. విద్యారంగానికి అసెంబ్లీ సమావేశాల్లో 30 శాతం నిధులు కేటాయించాలని, ఖాళీగా ఉన్న ఎంఈఓ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఆమనగల్లు ప్రాంతంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పడి 23 ఏళ్లు గడుస్తున్నా నేటికీ సొంత భవనం లేదని, చెట్ల కింద చదువులు కొనసాగిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం స్కాలర్‌షిప్‌లు, ఫీజురీయింబర్స్‌మెంట్ విడుదల చేసేవరకు పోరాటం ఆపేది లేదన్నారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షులు చరణ్, శివ, శ్రీకాంత్, తరంగ్, సహాయ కార్యదర్శులు శ్రీకాంత్, అరుణ్, స్టాలిన్, సంధ్య, జిల్లా కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

పురాతన ప్రార్థనాలయం కూల్చివేత



మీడియాతో మాట్లాడుతున్న రాజేంద్రనగర్ డీసీపీ శ్రీనివాస్

- ఠాణా ఎదుట ఓ వర్గం ఆందోళన
- పరిస్థితిని అదుపుచేసిన పోలీసులు

మొయినాబాద్: సుమారు మూడు వందల ఏళ్ల నాటి ఓ ప్రార్థనాలయాన్ని కూల్చివేయడం కలకలం రేపింది. మండల పరిధిలోని చిలుకూరులో సోమవారం ఈ సంఘటన చోటుచేసుకుంది. చిలుకూరు రెవెన్యూలోని సర్వేనంబర్ 133, 134లో ఓ ఎన్ఆర్ఐకి సంబంధించిన భూమి ఉంది. అందులో సుమారు మూడు వందల ఏళ్లనాటి ప్రార్థనాలయం ఉంది. ఎన్ఆర్ఐకి సంబంధించిన భూమిని ఇటీవల చదును చేస్తున్నారు. అదే క్రమంలో ప్రార్థనాలయాన్ని సైతం కూల్చివేశారు. విషయాన్ని గమనించిన చిలుకూరు గ్రామస్తులు అధికారులు, మొయినాబాద్ పోలీసులకు సమాచారం అందించారు. అప్పటికే విషయం బయటకు తెలియడంతో సోమవారం రాత్రి ఓ వర్గానికి చెందిన యువకులు, నాయకులు పెద్ద సంఖ్యలో మొయినాబాద్ పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ రహమత్‌బేగ్, తెలంగాణ రాష్ట్ర మైనార్టీ చైర్మన్ ఫహీంకురేషీ, ఇతర నాయకులు పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని ప్రార్థనాలయం కూల్చినవారిపై కేసులు నమోదు చేయాలని.. కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. రాజేంద్రనగర్ డీసీపీ శ్రీనివాస్, మొయినాబాద్ ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్‌రెడ్డి వారితో మాట్లాడి పరిస్థితిని అదుపుచేశారు. రాత్రి 11 గంటల సమయంలో ఘటనా స్థలానికి చేరుకుని కూల్చిన ప్రార్థనా మందిరాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా డీసీపీ శ్రీనివాస్ మాట్లాడుతూ.. కూల్చినవారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎవరూ ఎలాంటి ఆందోళన చెందొద్దని తెలిపారు.



షాద్‌నగర్ చౌరస్తాలో నిరసన వ్యక్తం చేస్తున్న దివ్యాంగులు

దివ్యాంగులను కించపరచడం సరికాదు

- ఎన్‌పీఆర్‌డీ జిల్లా అధ్యక్షుడు ఆశన్నగారి భుజంగరెడ్డి

షాద్‌నగర్: ఆలిండియా సర్వీసుల్లో దివ్యాంగుల కోటాపై ఐఏఎస్ అధికారిణి స్మితా సబర్వాల్ దివ్యాంగులను కించపరిచేలా మాట్లాడటం సరికాదని దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్‌పీఆర్‌డీ) జిల్లా అధ్యక్షుడు ఆశన్నగారి భుజంగరెడ్డి అన్నారు. ఆమె చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ సోమవారం షాద్‌నగర్ పట్టణ చౌరస్తాలో ఎన్‌పీఆర్‌డీ ఆధ్వర్యంలో దివ్యాంగులు ధర్నా నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన భుజంగరెడ్డి మాట్లాడుతూ.. ఉన్నత హోదాలో ఉన్న స్మితా సబర్వాల్ దివ్యాంగులను కించపరిచేలా వ్యాఖ్యలు చేయడం బాధాకరమని అన్నారు. దివ్యాంగులకు వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఆమెపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. లేని పక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చేగూరి శేఖర్‌గౌడ్, సంతోష, విజయభారతి, మనీలా, సువర్ణ, అంజయ్య, అనుసూయ, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు భాగ్యలక్ష్మి అమ్మవారికి బంగారు బోనం



చార్మినార్: సప్త మాతృకలకు సప్త బంగారు బోనం కార్యక్రమంలో భాగంగా మంగళవారం చార్మినార్ భాగ్యలక్ష్మి అమ్మవారికి భక్తులు బంగారు బోనం సమర్పించనున్నారు. ఆషాఢ మాసం బోనాల జాతర ఉత్సవాలను పురస్కరించుకుని భాగ్యనగర్ శ్రీ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ ఆధ్వర్యంలో ఈసారి నగరంలోని మహంకాళి దేవాలయాల అమ్మ వార్లకు బంగారు బోనాలు సమర్పిస్తున్నారు. ఇందులో భాగంగా ఆరో బోనంగా..మంగళవారం చార్మినార్ భాగ్యలక్ష్మి అమ్మవారికి బంగారు బోనంతో పాటు పట్టు వస్త్రాలు, వడి బియ్యం సమర్పించనున్నామని కమిటీ చైర్మన్ గాజుల అంజయ్య తెలిపారు. పాతబస్తీ మీరాలం మండి శ్రీ మహంకాళేశ్వర దేవాలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఊరేగింపుగా చార్మినార్‌కు తరలి వెళ్తామన్నారు. జోగిని నిషా క్రాంతి బంగారు బోనమెత్తనున్నారన్నారు.



రంగ రంగ వైభవంగా..

సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి అమ్మవారి బోనాలు సోమవారం వైభవంగా ముగిశాయి. వేలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. బోనాల్లో రెండో ఘట్టమైన రంగంలో స్వర్ణలత భవిష్యవాణిని వినిపించారు. ఈ ఏడాది వర్షాలు బాగా కురుస్తాయని, ప్రజలను బాగా చూసుకుంటానని, నన్ను నమ్ముకున్నవారిని కాపాడుతానని చెప్పారు. మంత్రి పొన్నం ప్రభాకర్, దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజ రామయ్యర్ తదితరులు పాల్గొన్నారు.







ముదిరాజ్‌లను బీసీ-ఏలో చేర్చాలి

రాష్ట్ర ఆర్గనైజ్ సెక్రటరీ చంద్రయ్యముదిరాజ్, జిల్లా అధ్యక్షుడు మల్లేశ్‌ముదిరాజ్


అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న ముదిరాజ్ మహాసభ నాయకులు

కందుకూరు/మొయినాబాద్‌రూరల్: ముదిరాజ్‌లను బీసీ-డీ నుంచి ఏ గ్రూప్‌లో చేర్చాలని కోరుతూ ముదిరాజ్ మహాసభ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ భూపాల్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఆర్గనైజ్ సెక్రటరీ కర్రోళ్ల చంద్రయ్యముదిరాజ్, జిల్లా అధ్యక్షుడు బైరమోని మల్లేశ్‌ముదిరాజ్ మాట్లాడారు. ముదిరాజ్ హక్కుల కోసం కాసాని జ్ఞానేశ్వర్‌ముదిరాజ్ నిరంతరం పోరాటం చేసి ఆనాటి ఉమ్మడి ముఖ్యమంత్రి వైఎస్‌ఆర్ ప్రభుత్వంలో ముదిరాజ్‌ల స్థితిగతులపై అధ్యయనం చేయించారన్నారు. బీసీ ఏ గ్రూప్‌నకు మారుస్తూ జీఓ నంబర్ 15 జారీ చేశారన్నారు. కొంత మంది కోర్టుకు వెళ్లడంతో ఆనాడు జీఓ అమలుకు నోచుకోలేదన్నారు. ప్రస్తుత ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఆ జీఓను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళనలు చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం యూత్ జిల్లా అధ్యక్షుడు మహేందర్‌ముదిరాజ్, జిల్లా కార్యదర్శి కృష్ణముదిరాజ్, నాయకులు బాబురావుముదిరాజ్, అంజయ్యముదిరాజ్, సురేందర్‌ముదిరాజ్, శ్రీలతశ్రీహరిముదిరాజ్, గణేష్‌ముదిరాజ్, రాములుముదిరాజ్, భిక్షపతి ముదిరాజ్, వెంకటేష్, జంగయ్య, యాదయ్య, సతీష్‌చంద్ర, రమేష్, ఉదయ్, లింగం, సుదర్శన్, ప్రవీణ్ పాల్గొన్నారు.

పీహెచ్‌సీకి భవనం నిర్మించాలని వినతి


మంత్రి దామోదర రాజ నర్సింహకు వినతిపత్రం అందిస్తున్న లక్ష్మీనివాస్

తలకొండపల్లి: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి(పీహెచ్‌సీ) నూతన భవనం నిర్మించాలని టీఎస్‌ఎస్‌ఓ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనివాస్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం హైదరాబాద్‌లో వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజ నర్సింహకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పీహెచ్‌సీ భవనం పూర్తిగా శిథిలమై పోయిందన్నారు. వర్షాలకు పైకప్పుపై నీరు నిలిచి భవనం కూలిపోయే ప్రమాదముందని మంత్రికి విన్నవించారు. అంతేగాకా భవనం లీకేజీలతో ఆస్పత్రిలోకి నీరు వస్తోందని, దీంతో రోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. నిధులు మంజూరు చేసి నూతన భవనం నిర్మించాలని మంత్రిని కోరారు.

విమానం ఆలస్యం.. ప్రయాణికుల ఆందోళన

శంషాబాద్: విమానం ఆలస్యం కావడంతో ప్రయాణికులు ఆందోళన చేసిన సంఘటన శంషాబాద్ ఎయిర్‌పోర్టులో చోటు చేసుకుంది. సోమవారం ఎయిర్‌పోర్టు నుంచి ఢిల్లీ వెళ్లాల్సిన విమా నం సమయానికి బయలు దేరలేదు.

ఐటీ..పిటీ!

> సైబరాబాద్ పోలీసు కమిషనరేట్‌లోని ఐటీ జోన్ రోడ్డు ప్రమాదాల విషయంలో డేంజర్ జోన్‌గా మారిపోయింది. రాజధానిలోని మూడు కమిషనరేట్లతో పోలిస్తే... ఇక్కడి నాలుగు పోలీస్ స్టేషన్ల పరిధిలోనే అత్యధికంగా ప్రమాదాలు నమోదయ్యాయి. ఆయా ప్రాంతాల్లో గతేడాది మొత్తం 800 రోడ్డు ప్రమాదాలు జరిగాయి. ఈ ఘటనల్లో 123 మంది మృత్యువాతపడగా, 685 మంది క్షతగాత్రులైనట్లు పోలీసు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ఆయా ప్రాంతాల్లో వాహనచోదకుల ఉల్లంఘనలు, నిర్లక్ష్యమే ఇందుకు కారణమని అధికారులు పేర్కొంటున్నారు. మౌలికవసతుల లేమి సైతం దీనికి ప్రధాన కారణంగా మారింది.
>
> -సాక్షి, సిటీబ్యూరో

- యాక్సిడెంట్ జోన్‌గా ఐటీ కారిడార్
- నాలుగు కీలక ఠాణాల పరిధిలోనే అత్యధిక ప్రమాదాలు
- 800 ప్రమాదాల్లో 123 మంది మృత్యువాత
- ఓవర్ స్పీడింగ్, ర్యాష్ డ్రైవింగూ కారణాలే
- స్పష్టం చేస్తున్న గతేడాది గణాంకాలు

ఐటీ కారిడార్‌తో పాటు చుట్టు పక్కల ప్రాంతాలు...

రాజధానిలోని హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ పోలీస్ కమిషనరేట్ల పరిధిలో 2023లో చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదాలను విశ్లేషించిన నేపథ్యంలో ఆందోళనకర అంశాలు వెలుగులోకి వస్తున్నాయి. మూడూ కమిషనరేట్ల పరిధిలో 160 పోలీస్ స్టేషన్ల ఉండగా... ఐటీ జోన్ విస్తరించి ఉన్న నార్సింగి, మాదాపూర్, గచ్చిబౌలి, రాయదుర్గం ఠాణాలతో పాటు దీని చుట్టుపక్కల పాంతాల్లోనూ రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా నమోదయ్యాయి. ప్రధానంగా రాజేంద్రనగర్, మియాపూర్, కూకట్‌పల్లి పీఎస్‌ల పరిధిలోని ప్రాంతాలు వాహనచోదకులకు నెలవుగా మారుతున్నాయని గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ఐటీ జోన్‌లోని నాలుగు ఠాణాల పరిధిలో జరిగిన 800 రోడ్డు ప్రమాదాల్లో 123 మంది చనిపోగా... దాని చుట్టూ విస్తరించి ఉన్న మూడు పోలీసుస్టేషన్ల పరిధిలో 147, 126, 117 చొప్పున మరణాలు రికార్డయ్యాయి.

శివార్లలోనూ..

ప్రధాన నగరం, దానికి ఆనుకుని ఉన్న శివార్లతో పాటు బయట ఉన్న ప్రాంతాల్లోనూ కొన్ని రోడ్డు ప్రమాదాలకు నెలవుగా మారుతున్నాయని పోలీసుల గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. అటు ఇండస్ట్రియల్-కమర్షియల్, ఇటు రెసిడెన్షియల్ ఏరియాలో ఎక్కువగా ఉండే మేడ్చల్ పరిధిలోని ప్రాంతాల్లో గత ఏడాది జరిగిన రోడ్డు ప్రమాదాల్లో 64 మంది చనిపోగా... 126 మంది క్షతగాత్రులయ్యారు. ఇక్కడ ఈ ఏడాది జనవరి-ఏప్రిల్ మధ్య జరిగిన రోడ్డు ప్రమాదాల్లో 21 మంది చనిపోగా... 66 మంది క్షతగాత్రులయ్యారు. 2023 నాటి గణాంకాల ప్రకారం మొయినాబాద్ పరిధిలో జరిగిన యాక్సిడెంట్స్‌లో 47 మంది చనిపోగా, 77 మంది క్షతగాత్రులయ్యారు. దుండిగల్ పరిధిలో 44, ఆర్సీపురం పరిధిలో 41, శామీర్‌పేట పరిధిలో 40 మృతులతో కూడిన రోడ్డు ప్రమాదాలు నమోదయ్యాయి. ఈ పరిస్థితులకు కారణాలను అధ్యయనం చేస్తున్న పోలీసులు నిరోధానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నారు.







ఆ మూడు కారణాలతోనే..

ఐటీ కారిడార్‌లోని నాలుగు పోలీసుస్టేషన్ల పరిధిలోని ప్రాంతాలు డేంజర్ జోన్‌గా మారడానికి ప్రధానంగా మూడు కారణాలు గుర్తించినట్లు అధికారులు చెబుతున్నారు. ఆయా ప్రాంతాల్లో అత్యధికులు ఐటీ ఉద్యోగులే. వీరితో పాటు సంపన్నులు కూడా పెద్ద సంఖ్యలోనే నివసిస్తున్నారు. వీరు వినియోగిస్తున్న వాహనాల్లో హైఎండ్ వాహనాలే ఎక్కువగా ఉంటున్నాయి. రహదారులు సైతం మిగిలిన ప్రాంతాలతో పోలిస్తే విశాలంగా, భిన్నంగా ఉంటాయి. దీంతో ద్విచక్ర వాహనచోదకులతో పాటు తేలికపాటి వాహనాలు నడిపే వాళ్లూ మితిమీరిన వేగంతో దూసుకుపోతుంటారు. ఈ ఓవర్ స్పీడింగ్, ర్యాష్ డ్రైవింగ్ వల్లే ఎక్కువ ప్రమాదాలు, మరణాలు చోటు చేసుకుంటున్నాయి. ఐటీ కారిడార్లలోని రహదారుల్లో దాదాపు అన్నింటికీ మధ్య డివైడర్లు ఉన్నాయి. వీటి కారణంగా ఓ దిశలోని మార్గంలోని ప్రయాణిస్తున్న వాహనచోదకులు మరో దిశలోని మార్గంలోకి వెళ్లాలంటే 'యూ' టర్న్ కోసం దూరం వెళ్లాల్సి వస్తోంది. దీంతో చాలా మంది రాంగ్ రూట్‌ను ఆశ్రయించి ప్రమాదాలు కొని తెచ్చుకుంటున్నారు.

మౌలికవసతులూ కనిపించవు

రహదారులు, డివైడర్లు, పుట్‌పాత్‌ల వంటి అంశాల్లో నగరంలోని ఇతర ప్రాంతాలతో పోలిస్తే ఐటీ జోన్ అడ్వాన్స్‌లోనే ఉన్నప్పటికీ... పాదచారికి అవసరమైన కొన్ని మౌలిక వసతులు మాత్రం కనిపించట్లేదు. ప్రధానంగా రోడ్డు దాటడానికి ఉపకరించే పుట్‌ఓవర్ బ్రిడ్జిలు అవసరమైన స్థాయిలో లేవు. కొన్నిచోట్ల పెలికాన్ సిగ్నల్స్ ఉన్నప్పటికీ... లక్ష్యం పూర్తి స్థాయిలో నెరవేరట్లేదు. ఈ కారణాల వల్ల పాదచారులు సైతం పెద్ద సంఖ్యలోనే ప్రమాదాల బారిన పడుతున్నారు. ఐటీ కారిడార్‌లో రోడ్డు ప్రమాదాల సంఖ్య పెరగడానికి ఇదీ ఓ కారణంగా మారుతోంది. ఈ ఏరియాలతో పాటు జాతీయ రహదారి నెం.65పై ఉన్న ఎల్బీనగర్-హయత్‌నగర్ మధ్య ప్రాంతంలోనూ గతేడాది రోడ్డు ప్రమాదాలు ఎక్కువగానే జరిగాయి. ఈ స్ట్రెచ్‌లో 400 యాక్సిడెంట్స్ నమోదు కావడానికి లారీలు, భారీ వాహనాలు కారణమని అధికారులు భావిస్తున్నారు. ఈ రహదారికి రెండు వైపులా రెసిడెన్షియల్ ఏరియాలు ఉన్నాయి. అక్కడ నివసించే వారు రాకపోకలు సాగించే సమయంలో లారీలు, భారీ వాహనాలు చేస్తున్న ఉల్లంఘనలకు బలవుతున్నారు.

అక్రమ సర్టిఫికెట్ల జారీలో రిమాండ్

నెల రోజుల పాటు పరారీలో ఉన్న ముగ్గురు నిందితులు


నిందితుల వివరాలు వెల్లడిస్తున్న సీఐ బాబ్యానాయక్

మంచాల: తహసీల్దార్ కార్యాలయం నుంచి అక్రమంగా ఆదాయ సర్టిఫికెట్లు జారీ చేసిన కేసులో ఎట్టకేలకు ముగ్గురిని మంచాల పోలీసులు సోమవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. సీఐ బాబ్యానాయక్ కథనం ప్రకారం.. మంచాల తహసీల్దార్ కార్యాలయంలో అవుట్ సోర్సింగ్ కంప్యూటర్ ఆపరేటర్‌గా ఏపీలోని అన్నమయ్య జిల్లాకు చెందిన పురం సురేశ్‌బాబు కొన్నేళ్లుగా పని చేస్తున్నాడు. అతడు అక్రమ సంపాదనకు అలవాటు పడి తహసీల్దార్ కార్యాలయం నుంచి స్థానికేతరులకు అక్రమంగా ఆదాయ సర్టిఫికెట్లు జారీ చేశాడు. ఈ విషయం స్థానిక తహసీల్దార్ దృష్టికి రావడంతో గత నెల రోజుల క్రితం మంచాల పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనంతరం సురేశ్‌బాబు పోలీసులకు చిక్కకుండా పరారీలో ఉన్నాడు. చివరికి పోలీసుల ఒత్తిడి మేరకు సురేశ్‌బాబుతో సహా ముగ్గురు సోమవారం లొంగిపోయారు. సురేశ్‌బాబుకు నగరంలోని ఆర్టీసీ క్రాస్ రోడ్డులో గల లక్కీ మీసేవా సెంటర్ నిర్వాహకుడు పత్తి రవికుమార్, ఏపీలోని శ్రీకాకుళానికి చెందిన గోరు రవికుమార్‌తో పరిచయముంది. ఆర్టీసీ క్రాస్ రోడ్డు మీసేవా వద్దకు ఆదాయ సర్టిఫికెట్ల కోసం వచ్చే వారి నుంచి డబ్బులు తీసుకొని మంచాల తహసీల్దార్ కార్యాలయంలో సర్టిఫికెట్లు జారీ చేశారు. ఇలా ముగ్గురు కలిసి అక్రమ సర్టిఫికెట్ల దందా సాగించారు. గతంలోనూ నిందితులు ఇలాంటి ఘటనలు అనేకం చేసినట్లు పోలీసుల వివరణలో తేలింది. ఎట్టకేలకు ముగ్గురిని అదుపులోకి రిమాండ్‌కు తరలించారు.

పెండింగ్ డీఏలను వెంటనే చెల్లించాలి

మంచాల: పెరుగుతున్న నిత్యావసర ధరలకు అనుగుణంగా ప్రభుత్వం చెల్లించే కరువుభత్యం(డీఏ) పెంచాలని ఎస్టీయూటీఎస్ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి ఏ.వీ.సుధాకర్ సోమవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. డీఏ రెండున్నరేళ్లుగా ప్రభుత్వం పెంచడం లేదని ఆయన పేర్కొన్నారు. తక్షణమే పెండింగ్‌లో ఉన్న డీఏలను చెల్లించాలన్నారు. పీఆర్సీ గడువు ముగిసి ఈ నెలతో ఏడాది కావొస్తుందని సంబంధిత కమిటీ మాత్రం ప్రభుత్వానికి నివేదిక సమర్పించ లేదని వాపోయారు. ప్రతి నెలా మొదటి తారీఖున వేతనాలు చెల్లిస్తున్న ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న డీఏలు, పీఆర్సీల గురించి మంత్రి మండలి సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకోవాలని కోరారు.

ఆకతాయిలపై కేసు నమోదు

ఆమనగల్లు: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో సోమవారం సాయంత్రం స్కూల్ విద్యార్థినులను ఈవ్ టీజింగ్ చేస్తున్న ముగ్గురు యువకులపై కేసు నమోదు చేసినట్లు ఆమనగల్లు ఎస్‌ఐ వెంకటేశ్ తెలిపారు. బస్టాండ్ ఆవరణలో ఉన్న పాఠశాల విద్యార్థులను కొందరు యువకులు ఈవ్ టీజింగ్‌కు పాల్పడుతున్నారని సమాచారంతో బస్టాండ్‌కు వెళ్లి వాళ్లను అదుపులోకి తీసుకున్నామన్నారు. ముగ్గురి యువకులపై కేసు నమోదు చేశామని అనంతరం వారి తల్లిదండ్రులను పోలీసు స్టేషన్‌కు పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చి పంపించామన్నారు. విద్యార్థినులను, యువతులను వేధిస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ఎవరైనా యువకులు వేధింపులకు పాల్పడితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఎస్‌ఐ తెలిపారు.

విద్యుదాఘాతానికి గేదె మృతి

ఇబ్రహీంపట్నం: మండలంలోని దండుమైలారం గ్రామంలో భారతమ్మ అనే రైతుకు చెందిన సుమారు రూ.70 వేల విలువ చేసే గేదె విద్యుత్ షాక్‌కు మృత్యువాత పడింది. కరెంట్ స్తంభం నుంచి భూమికి ఉంటే ఎర్త్ వైర్‌కు కరెంట్ సరాఫరా కావడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. తమకు నష్టపరిహారం చెల్లించాలని భారతమ్మ సోమవారం ప్రభుత్వాన్ని కోరారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ


దుండగులు ధ్వంసం చేసిన బీరువా

ఇబ్రహీంపట్నం: తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగిన సంఘటన ఇబ్రహీంపట్నం ఠాణా పరిధిలో చోటుచేసుకుంది. సీఐ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక కేవీ తండాలో నివాసముండే శ్రీనివాస్ ఇంటికి తాళం పెట్టి తన అక్క వద్దకు ఆదివారం వెళ్లారు. తిరిగి మరుసటి రోజు ఉదయం శ్రీనివాస్ ఇంటికి రాగా.. సామగ్రి చిందరవందరగా పడి ఉంది. బీరువా తాళాలు పగులగొట్టి ఉండడంతో చోరీ జరిగినట్లు గుర్తించారు. తులం బంగారం, 50 తులాల వెండి ఆభరణాలతోపాటు కొంత నగదును తస్కరించినట్లు ఆయన తెలిపారు. సోమవారం ఉదయం శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వివరించారు.

బీసీల హామీలు మరిచిన ప్రభుత్వం

బీజేపీ జిల్లా అర్బన్ అధ్యక్షుడు సామ రంగారెడ్డి


తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న బీజేపీ నాయకులు

హుడాకాంప్లెక్స్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎన్నికల సమయంలో బీసీలకు ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ నెరవేర్చలేదని బీజేపీ రంగారెడ్డి జిల్లా అర్బన్ అధ్యక్షుడు సామ రంగారెడ్డి ఆరోపించారు. ఈ మేరకు సోమవారం బీజేపీ ఆధ్వర్యంలో సరూర్‌నగర్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట చేపట్టిన ధర్నాలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాశం వెంకటేశ్వర్లుతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం ఏర్పడ్డ ఆరు నెలలలోపే కులగణన చేసి కమిషన్ నివేదిక ఆధారంగా బీసీలకు రిజర్వేషన్లు పెంచి, స్థానిక సంస్థల్లో ఉన్న బీసీ రిజర్వేషన్లు 23 నుంచి 42 శాతానికి పెంచుతామని ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించారు. అదే విధంగా గొల్ల కురుమలకు అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే రెండో దశ గొర్రెల పంపిణీకి రూ.రెండు లక్షలు లబ్ధిదారుని ఖాతాల్లో వేస్తామన్నారని మోసం చేశారని, ఎంబీసీ కులాలకు ప్రత్యేక సంక్షేమ మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేస్తామని చేయలేదన్నారు. రాష్ట్రంలోని మత్స్య సంఘాలకు చేప పిల్లలు పంపిణీ చేయలేదన్నారు. ప్రభుత్వం బీసీలకు ఇచ్చిన హామీలపై వారం రోజుల్లోగా స్పష్టత ఇవ్వకపోతే అన్ని జిల్లా కలెక్టరేట్ల ముందు ధర్నాలు చేస్తామని హెచ్చరించారు. అనంతరం తహసీల్దార్ వేణుగోపాల్‌కు వినతిపత్రం అందజేశారు. ధర్నాలో కార్పొరేటర్ మహేశ్వర్‌రెడ్డి, నాయకులు సురేందర్‌యాదవ్, సంజయ్, మురళీ, ప్రశాంత్‌ముదిరాజ్, శ్రీనివాస్, లక్ష్మీప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు చెల్లించాలని డిమాండ్

ఆదర్శ పాఠశాలలో పనిచేసే ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు


అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు

చేవెళ్ల: రాష్ట్రంలో ఆదర్శ పాఠశాలలో పనిచేస్తున్న తమకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు వెంటనే చెల్లించాలని ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు కోరారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్, అదనపు కలెక్టర్లను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చాలీచాలని తక్కువ వేతనాలతో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల వేతనాలు నెలల తరబడి రాకపోవటంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. నెలనెల వచ్చే వేతనంపైనే ఆధారపడి పనిచేస్తున్న వారికి కుటుంబభారం కష్టంగా మారుతుందన్నారు. పిల్లల చదువులు, ఫీజులు, కుటుంబాన్ని కొనసాగించేందుకు ఆధారమైన వేతనాలు పెండింగ్‌లో ఉంటే మా పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. ప్రభుత్వం స్పందించి ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల వేతనాలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు కలెక్టర్ స్పందించి విద్యాశాఖ అధికారులకు సమస్యను పరిష్కరించాలని ఆదేశించినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో ఉద్యోగులు ఆంజనేయులు, శేఖర్, రాజేందర్‌రెడ్డి, నవనీత, వేదప్రకాష్, రాధాకృష్ణ, శివ, ఉపేందర్, జంగయ్య, మల్లేశ్, యాదయ్య, నర్సింలు ఉన్నారు.

తారామతిపేట పంచాయతీ కార్యదర్శి సస్పెండ్

అక్రమాలకు పాల్పడ్డాడని కలెక్టర్ చర్యలు

అబ్దుల్లాపూర్‌మెట్: నిబంధనలకు విరుద్ధంగా భూదాన్ భూమిలో అక్రమ నిర్మాణాలకు ఇంటి అనుమతులు ఇవ్వడంతో పాటు విధుల్లో నిర్లక్ష్యం వ్యవహరించినందుకు మండలంలోని తారామతిపేట గ్రామ పంచాయతీ కార్యదర్శి రాజేశ్‌గౌడ్‌ను విధుల నుంచి తొలగిస్తూ కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. గ్రామంలోని సర్వేనంబర్ 215, 216, 217లలో ఉన్నటువంటి భూదాన భూమిలో అక్రమంగా ఇంటి అనుమతులు ఇచ్చాడన్న ఫిర్యాదుతో విచారణ చేపట్టారు. మండల పంచాయతీ అధికారులు రాజేశ్‌గౌడ్ అక్రమాలకు పాల్పడినట్లు నిర్ధారించి అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పాటు జిల్లా అధికారుల దృష్టికి తీసుకువెళ్లిన విషయం తెలిసిందే. దీంతో సోమవారం కలెక్టర్ శశాంక పంచాయతీ కార్యదర్శి రాజేశ్‌గౌడ్‌ను విధుల నుంచి తొలగిస్తూ ఆదేశాలు జారీ చేశారు.

లైంగిక దాడి కేసులో నిందితుడికి ఏడేళ్ల జైలు

మేడ్చల్: బాలికపై లైంగిక దాడికి పాల్పడిన వ్యక్తికి ఏడేళ్ల జైలు శిక్ష విధిస్తూ మేడ్చల్ పోక్సో కోర్టు సోమవారం తీర్పు ఇచ్చింది. అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ శాంరావు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. అల్వాల్, భూదేవి నగర్‌కు చెందిన బాలిక 8వ తరగతి చదువుతోంది. 2018లో రాజస్థాన్‌కు చెందిన రాకేష్ కునావత్ అనే యువకుడు తన స్నేహితుడు భరత్‌దినేష్‌తో కలిసి ఆమెను విమానంలో ఢిల్లీకి తీసుకెళ్లి అక్కడ హోటల్ గదిలో లైంగికదాడికి పాల్పడ్డాడు. అనంతరం ఆమెను నగరానికి తీసుకువచ్చి వదిలేశాడు. బాధితురాలి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన అల్వాల్ పోలీసులు నిందితులు రాకేష్ కునావత్, భరత్‌దినేష్‌లను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. కేసు విచారణ చేపట్టిన మేడ్చల్ పోక్సో కోర్టు న్యాయమూర్తి జంగా జీవన్‌కుమార్ నిందితుడు రాకేష్ కునావత్‌కు ఏడేళ్ల జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెల్లడించారు.